క్లుప్తంగా

క్రీడాపరికరాల అందజేత


క్రీడా పరికరాలు అందజేస్తున్న ఎంపీటీసీ సునీత గోపాలకృష్ణ

పరవాడ: మండలంలోని తానాం రెసిడెన్షియల్ కళాశాల, బాలికల పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు స్థానిక ఎంపీటీసీ రొంగలి సునీత గోపాలకృష్ణ క్రీడా పరికరాలు సమకూర్చారు. ఈ మేరకు తన సొంత నిధులు రూ.30 వేలతో కొనుగోలు చేసిన క్రీడా పరికరాలను కళాశాల ప్రిన్సిపాల్ ఎం.అప్పలనాయుడుకు శుక్రవారం రాత్రి అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ విద్యార్థులు క్రీడలతో పాటు చదువుపై ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల కమిటీ చైర్మన్ పైల శ్రీరామ్మూర్తి, గ్రామ పెద్దలు డి.ఎం.ఎల్ నాయుడు, జి.సన్యాసిరావు, కె.శ్రీను, బి.గణపతి, జి.సోమునాయుడు, సీహెచ్.అప్పలరాజు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

పరవాడ: గాజువాక–పరవాడ రహదారిలో గొర్లివానిపాలెం వద్ద శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వృద్ధుడు మృతి చెందాడని సీఐ పి.ఈశ్వరరావు చెప్పారు. గొర్లివానిపాలెం లారస్ ల్యాబ్ సముదాయం వద్ద శుక్రవారం రాత్రి 10 గంటల సమయంలో రోడ్డు దాటుతున్న వృద్ధుడిని గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టి వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన అతను అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రిలో భద్రపరిచారు. సమాచారం తెలిసిన వారు పరవాడ పోలీసు స్టేషన్‌లో, 9440796038 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని సీఐ ఈశ్వరరావు కోరారు.

కన్వెన్షన్ సెంటర్ పనులు వేగవంతం


నిర్మాణ పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్ ముమ్మన దేముడు

పెందుర్తి: జీవీఎంసీ 95వ వార్డు చీమలాపల్లిలో కన్వెన్షన్ సెంటర్ నిర్మాణ పనులను కార్పొరేటర్ ముమ్మన దేముడు శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యసభ్య సభ్యుడు వి.విజయసాయిరెడ్డి ఎంపీ నిధులు రూ.2 కోట్లతో ఈ కన్వెన్షన్ సెంటర్ నిర్మాణం జరుగుతుందన్నారు. పనులు వేగవంతం చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. వీఎంఆర్‌డీఏ ఏఈ శ్రీనివాసరెడ్డి, నాయకులు గంట్ల నరసింహమూర్తి, అప్పికొండ రాంబాబు, కంచిబోయిన సంతోష్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

350 మందికి వైద్య పరీక్షలు


వైద్య పరీక్షలను పరిశీలిస్తున్న దాసరి సత్తిబాబు

సింహాచలం: జీవీఎంసీ 93వవార్డు గణేష్‌కాలనీ లో శనివారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరానికి విశేష స్పందన లభించింది. వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు దాసరి సత్తిబాబు ఈ శిబిరాన్ని ప్రారంభించారు. 350 మందికి స్పెషలిస్టు వైద్యులు వైద్య సేవలు అందించారు. బీపీ, సుగర్ టెస్టులు నిర్వహించారు. చిన్నారులకు ప్రత్యేక వైద్య సేవలందించారు. మందులు ఉచితంగా అందజేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు వీవీ కేరాజు, ఢిల్లేశ్వరరావు, బి.కనరాజు, పార్వతి, మూర్తి, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

బాణసంచా తయారు చేస్తే కఠిన చర్యలు

- అనుమతి లేకుండా విక్రయించవద్దు
- డీఎస్పీ సత్యనారాయణ


బాణసంచా తయారీ కేంద్రాలను సీఐ రంగనాథంతో కలిసి పరిశీలిస్తున్న డీఎస్పీ సత్యనారాయణ

సబ్బవరం: దీపావళి సందర్భంగా ప్రభుత్వ అనుమతులు లేకుండా బాణసంచా తయారు చేసినా.. విక్రయించినా చట్ట ప్రకారం కఠినమైన చర్యలు తీసుకుంటామని పరవాడ డీఎస్పీ సత్యనారాయణ హెచ్చరించారు. సబ్బవరం సీఐ పి. రంగనాథంతో కలిసి శనివారం ఆయన మండలంలో గతంలో బాణసంచా తయారీ కేంద్రాలుగా గుర్తించిన గంగవరం ,మల్లు నాయుడుపాలెం, మొగలిపురం, గుల్లేపల్లి,అంతకాపల్లి గ్రామాల్లో పర్యటించారు. అనంతరం పోలీస్ స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడారు. సబ్బవరం మండల పరిధిలో ఇద్దరు మాత్రమే బాణసంచా తయారు చేయడానికి అనుమతులు తీసుకున్నారని గుర్తించినట్లు పేర్కొన్నారు. అయితే గతంలో బాణ సంచా తయారు చేస్తూ ప్రమాదాలకు గురైన కారణంగా తయారీ చేయడం పూర్తిగా మానేసినట్లు గుర్తించామన్నారు. పరవాడ పోలీస్ సబ్ డివిజన్ పరిధిలో గతంలో బాణసంచా తయారుచేసి అరెస్ట్ అయిన వారు 123 మంది ఉన్నట్లు తెలిపారు.వీరిలో 93 మందిపై బైండోవర్ కేసులు నమోదు చేశామని,18 మంది చనిపోగా మిగిలిన వారిని బైండోవర్ చేయాల్సి ఉందన్నారు.

అనుమతులు తప్పనిసరి

దీపావళి రోజున బాణసంచా విక్రయాలకు సంబంధించి పోలీసులు ,రెవెన్యూ,అగ్నిమాపక శాఖ అధికారుల అనుమతి ఉన్న వారికే స్టాల్స్ ఏర్పాటుకు అవకాశం ఉంటుందన్నారు. జనావాసాలకు దూరంగా, బాణసంచా దుకాణానికి దుకాణానికి మధ్య నిర్దేశించిన దూరం ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఎవరైనా ప్రభుత్వ ఆదేశాలను పాటించకుండా బాణసంచా అక్రమ వ్యాపారం చేసినా.. శివకాశి లాంటి ప్రాంతాల నుంచి దీపావళికి ముందుగానే భారీ ఎత్తున బాణసంచా తీసుకువచ్చి జాగ్రత్తలు లేకుండా నివాసాల వద్ద పెట్టినట్లు గుర్తిస్తే సమాచారం ఇవ్వాలని కోరారు. ఇచ్చిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని, ప్రమాదాలు జరగకుండా నివారించడానికి సహకరించిన వారు అవుతారని డీఎస్పీ సత్యనారాయణ విజ్ఞప్తి చేశారు.

ప్రహరీ నిర్మాణ పనులకు శంకుస్థాపన


వాటర్ ట్యాంక్ పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే అదీప్ రాజు, బెహరా భాస్కరరావు

గోపాలపట్నం: జీవీఎంసీ 92వ వార్డు బంటాకాలనీలో మంచినీటి రిజర్వాయర్ ట్యాంక్ ప్రహరీ పనులకు ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్, జీవీఎంసీ కోఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రహరీ నిర్మాణానికి జీవీఎంసీ నిధులు రూ. 20 లక్షలు వెచ్చిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రప్రభుత్వం మౌలిక సదుపాయాలపై ప్రత్యేక శ్రద్ధ చూపిస్తోందన్నారు. రహదారులు కాల్వలు, కమ్యూనిటీహాళ్ల మరమ్మతులు, గెడ్డల ఆధునికీకరణ వంటివాటికి ప్రాధాన్యమిస్తోందని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు అప్పలస్వామినాయుడు, యతిరాజుల నాగేశ్వరరావు, జగదీష్, వల్లి, శంకర్, రమణమ్మ, అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

వెంకన్నకు ప్రత్యేక పూజలు


పూజలందుకున్న వేంకటేశ్వరస్వామి

పెందుర్తి: వెంకటాద్రిపై వెలసిన వేంకటేశ్వరస్వామికి శనివారం ప్రత్యేక పూజలు జరిపారు. సుప్రభాతసేవ చేశారు. గోత్రనామాలతో పూజలు చేశారు. భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు.

అవినీతి రహిత సమాజ స్థాపనకు కృషి


ర్యాలీలో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

పరవాడ: అవినీతి రహిత సమాజ స్థాపనకు విద్యార్థులు కృషి చేయాలని పి.బోనంగి సంస్కృతి గ్లోబల్ పాఠశాల ప్రిన్సిపాల్ ఎన్.సీతాలక్ష్మి పిలుపునిచ్చారు. సర్దార్ వల్లబాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకొని శనివారం నిర్వహించిన విజిలెన్స్ అవగాహన వారోత్సవాల్లో ఆమె మాట్లాడారు. అవినీతిపై పోరు పాఠశాలల స్థాయి నుంచే ప్రారంభం కావాలన్నారు. అవినీతికి నో చెప్పండి–దేశ సమగ్రతను కాపాడండి అనే నినాదంతో విద్యార్థులు నిజాయితీగా ఉండాలన్నారు. అనంతరం అవినీతికి వ్యతిరేకంగా విద్యార్థులు నినాదాలు చేశారు. కార్యక్రమంలో పాఠశాల సీఈవో కె.నిశాంత్, సమన్వయకర్త రామలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విశేషంగా నిత్య కల్యాణం


తలంబ్రాలు ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శనివారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవ మూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్ఠింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

పారదర్శకతతోనే ఆర్ట్ ఆఫ్ గుడ్ గవర్నెన్స్


వేడుకలో ప్రసంగిస్తున్న ఐఐఎం విశాఖ డైరెక్టర్ ప్రొఫెసర్ చంద్రశేఖర్

ఉక్కునగరం: అకౌంటబిలిటీ, రెస్పాన్సిబిలిటీ, పారదర్శకత పైనే ఆర్ట్ ఆఫ్ గుడ్ గవర్నెన్స్ ఆధారపడి ఉందని ఐఐఎం విశాఖ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎం.చంద్రశేఖర్ అన్నారు. స్టీల్‌ప్లాంట్‌లో శనివారం జరిగిన విజిలెన్స్ అవేర్‌నెస్ వీక్ ముగింపు వేడుకల్లో ఆయన ముఖ్యఅతిథిగా ప్రసంగించారు. మనిషి గుండే తన మనస్సాక్షికి మూలాధారమన్నారు. నైతికత, నీతిధర్మాలను, విలువలు మనిషిని ఉత్తమంగా నడిపిస్తాయన్నారు. స్టీల్ ప్లాంట్ సీఎండీ అతుల్ భట్ మాట్లాడుతూ అవినీతి అరికట్టడంలో డిజిటలైజేషన్‌ను విస్తృతంగా అనుసరించాలన్నారు. స్టీల్‌ప్లాంట్ చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ డాక్టర్ ఎస్. కరుణరాజు మాట్లాడుతూ అవినీతి నిరోధక సంస్థలు చెక్ పాయింట్లుగా వ్యవహరించి అన్ని రకాల అవినీతి పద్ధతులకు నిరోధకంగా పనిచేస్తాయన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో స్టీల్ ప్లాంట్ డైరెక్టర్లు ఎ.కె. బాగ్చీ, ఎస్.పి. పాండే, సీఐఎస్ఎఫ్ కమాండెంట్ అత్తర్ మహ్మద్ హనీఫ్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో హోమం

సింహాచలం: పునర్వసు నక్షత్రాన్ని పురస్కరించుకుని సింహగిరిపై గంగధార సమీపంలోని పురాతన రామాలయంలో శనివారం హోమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోని హోమం గుండం వద్ద చక్రపెరుమాళ్లను అధిష్ఠింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, మండపారాధన, అగ్నిప్రతిష్ఠ,హోమం, పూర్ణాహుతి విశేషంగా నిర్వహించారు. కుంభప్రోక్షణ కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా జరిపారు. భక్తులకు ప్రసాదం అందజేశారు.

8న ఉక్కు దీక్షకు మాజీ ఉప కులపతుల మద్దతు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ దీక్షకు మాజీ ఉప కులపతులు ఈనెల 8న మద్దతు ప్రకటించనున్నారని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ మంత్రి రాజశేఖర్ తెలిపారు. ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో చేస్తున్న రిలే నిరాహార దీక్షలు ఈనెల 8కు 1000వ రోజుకు చేరుకుంటున్నాయన్నారు. ఆ రోజు పోరాట కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టనున్నామన్నారు. ఆ రోజు అంబేడ్కర్ యూనివర్సిటీ మాజీ ఉప కులపతి ప్రొఫెసర్ హెచ్. లాలా లజపతిరాయ్, నాగార్జున యూనివర్సిటీ మాజీ ఉప కులపతి ప్రొఫెసర్ వి.బాలమోహన్, డాక్టర్ వైఎస్సార్ హెల్త్ యూనివర్సిటీ మాజీ ఉప కులపతి డాక్టర్ శ్యామ్ ప్రసాద్, రాయలసీమ యూనివర్సిటీ మాజీ ఉప కులపతి ప్రొఫెసర్ జీవీ ప్రభాకర్, ఏయూ మాజీ వీసీ ప్రొఫెసర్ జి.ఎస్.ఎన్.రాజు, విక్రం సింహపురి యూనివర్సిటీ మాజీ వీసీ ప్రొఫెసర్ రొక్కం ప్రభాకర్‌లు సంఘీభావం తెలపనున్నారు. ఈ కార్యక్రమానికి స్టీల్‌ప్లాంట్ కార్మికులు, అభిమానులు, సానుభూతిపరులు హాజరుకావాలని ఆయన కోరారు.

996వ రోజుకు చేరిన ఉక్కు దీక్షలు


దీక్షలో కార్మికులనుద్దేశించి మాట్లాడుతున్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు ప్రైవేటీకరణపై కార్మికులు చేస్తున్న ఉద్యమంలో దేశంలోని ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు కూర్మన్నపాలెం కూడలి వద్ద జరుగుతున్న ఉక్కు రిలే నిరాహార దీక్షలు శనివారం నాటికి 996వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలో వివిధ సంస్థలకు చెందిన కార్మికులు పాల్గొని స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

పక్కా ప్రణాళికతో వాకర్స్ క్లబ్ సేవలు


మాట్లాడుతున్న వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు పల్లా చంద్రమౌళి

మురళీనగర్: పక్కా ప్రణాళికతో వాకర్స్ క్లబ్ సేవా కార్యక్రమాలు నిర్వహించేందుకు చర్యలు తీసుకున్నామని క్లబ్ అధ్యక్షుడు పల్లా చంద్రమౌళి తెలిపారు. మురళీగనర్ వాకర్స్ పార్కులో శనివారం నిర్వహించిన క్లబ్ వార్షిక సమావేశంలో ఆయన మాట్లాడుతూ పార్కు సుందరీకరణ, క్లబ్ ఆర్థికాభివృద్ధి, సేవా, సామాజిక, సాంస్కృతిక కార్యక్రమాల వివరాలను సభ్యులకు వివరించారు. వాకర్స్ ఇంటర్నేషనల్ కార్యదర్శి కె.ద్వారకానాత్ మాట్లాడుతూ డిసెంబరు 23, 24 తేదీల్లో విశాఖలో జరగనున్న వాకర్స్ ఇంటర్నేషనల్ వార్షిక సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యదర్శి ఎల్‌వీ సుధాకర్, కోశాధికారి జె.కూర్మారావు క్లబ్ వార్షిక నివేదికలు తెలిపారు. ప్రపంచ శాంతి కోసం రెండు నిమిషాలు మౌనం పాటించారు. వాకర్స్ ఇంటర్నేషనల్ వ్యవస్థాపకుడు సుంకరి ఆళ్వార్ దాస్ చిత్రపటానికి నివాళులర్పించారు. వాకర్స్ వాయిస్ నెలవారి పత్రికను పూర్వ అధ్యక్షుడు ఎం.భాస్కరరావు ఆవిష్కరించారు.

నూతన కార్యవర్గం ఇదే

వాకర్స్ క్లబ్ 2024 సంవత్సరానికి ఇటీవల నిర్వహించిన ఎన్నికల్లో ఏకగ్రీవంగా ఎన్నికైన కొత్త కార్యవర్గాన్ని ఎన్నికల అధికారి ఎస్.బుచ్చయ్య ఈ సమావేశంలో ప్రకటించారు. అధ్యక్షుడిగా పల్లా చంద్రమౌళి, ఉపాధ్యక్షులుగా ఆదిభట్ల రామకృష్ణ, మళ్ల రామకృష్ణ, కార్యదర్శిగా ఎల్‌వీ సుధాకర్, కోశాధికారిగా జె.కూర్మారావు, జాలీ వాకర్‌గా ఎస్.ప్రకాశరావు, బోర్డు డైరెక్టర్లుగా టి.వెంకటరమణ, పి.చెల్వరాజు, వద్దాది అప్పారావు, ఆర్.నాగేశ్వరరావు, జి.విజయలక్ష్మి ఎన్నికయ్యారు. వాకర్స్ ఇంటర్నేషనల్ అదనపు ప్రధాన కార్యదర్శి రాళ్లపల్లి సత్యనాథం నూతన సభ్యులతో ప్రమాణం చేయించారు. తమను వరుసగా రెండో సారి ఎన్నుకున్నందుకు కార్యవర్గ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

విమ్స్‌లో సిద్ధమవుతున్న సెంట్రల్ డ్రగ్స్ స్టోరేజీ

ఆరిలోవ : విశాఖ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (విమ్స్)లో సెంట్రల్ డ్రగ్స్ స్టోరేజ్, సిటీ డయాగ్నొస్టిక్ సెంటర్ భవనం సిద్ధమవుతోంది. సుమారు రెండేళ్ల క్రితం విమ్స్ ఆవరణలో దీని నిర్మాణం ప్రారంభించారు. అప్పటి నుంచి జరుగుతున్న నిర్మాణ పనులు కొద్ది రోజులుగా వేగం పుంజుకున్నాయి. ఇటీవల వైద్య విభాగం అధికారులు ఈ నిర్మాణంపై దృష్టి పెట్టారు. తొందరగా పనులు జరిపించి వినియోగంలోకి తీసుకురావడానికి సిద్ధమవుతున్నారు. అరెకరం స్థలంలో ఈ నిర్మాణం చేపట్టారు. దీనికి రూ.20 కోట్లు ఖర్చు చేస్తున్నారు. ప్రస్తుతం భవనానికి రంగులు వేస్తున్నారు. అన్ని పనులు పూర్తయిన వెంటనే కొద్ది రోజుల్లో దీన్ని వినియోగంలోకి తీసుకురానున్నట్లు విమ్స్ డైరెక్టర్ డాక్టర్ కె.రాంబాబు తెలిపారు.


విమ్స్‌లో నిర్మాణంలో ఉన్న సిటీ డయాగ్నోస్టిక్ సెంటర్ భవనం

రిమాండ్ ఖైదీ మృతిపై 10న విచారణ

మహారాణిపేట: రిమాండ్ ఖైదీ బట్టు వీరబ్రహ్మం మృతిపై ఈ నెల 10న మెజిస్ట్రియల్ విచారణ చేపడుతున్నట్లు విశాఖ ఆర్డీవో డి.హుస్సేన్ సాహెబ్ తెలిపారు. గుంటూరు జిల్లా మంగళగిరి నగలమ్మ వీధికి చెందిన బట్టు వీరబ్రహ్మం(78)ను చికిత్స నిమిత్తం 2023 మే 15న కేజీహెచ్‌కు తీసుకొచ్చారు. అదే రోజు చికిత్స పొందుతూ ఆయన మృతి చెందాడు. దీనిని లాకప్ డెత్‌గా పరిగణించి విశాఖ ఆర్డీవోను విచారణాధికారిగా నియమించారు. కలెక్టర్ కార్యాలయం ఆవరణలోని తన కార్యాలయంలో ఆ రోజు 11 గంటలకు విచారణ ప్రారంభమవుతుందని పేర్కొన్నారు.

డీఆర్‌డీవో టీటీ పోటీల విజేత ఏఎస్‌ఎల్

విశాఖ స్పోర్ట్స్: డీఆర్‌డీవో సెంట్రల్ జోన్ టేబుల్ టెన్నిస్ టోర్నీలో హైదరాబాద్‌కు చెందిన ఏఎస్‌ఎల్ విజేతగా నిలవగా. ఆర్‌సీఐ రన్నరప్‌గా నిలిచింది. ఇక్కడి సాగరసమరతీర సాంకేతిక సంస్థ ఆధ్వర్యంలో ముగిసిన ఈ టీమ్ చాంపియన్‌షిప్‌లో తొమ్మిది మంది మహిళా క్రీడాకారిణులతో మొత్తంగా 102 మంది తొమ్మిది బృందాలు పోటీపడ్డాయి. ఎన్ఎస్‌టీఎల్, అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ లాబోరెటరీ(ఎఎస్ఎల్), సెంటర్‌ఫర్ హై ఎనర్జీ సిస్టమ్స్ సైన్సెస్, డిఫెన్స్ ఎలక్ట్రానిక్స్ రీసెర్చ్ లేబొరేటరీ(డెస్), రీసెర్చ్‌సెంటర్ ఇమారత్(ఆర్‌సిఐ), డిఫెన్స్ రీసెర్చ్ డెవలప్‌మెంట్ లేబొరేటరీ(డీఆర్‌డీఎల్)తో సహా వివిధ డీఆర్‌డీవో ల్యాబ్‌లకే చెందిన వీరంతా పోటీపడ్డారు.

పారదర్శకంగా ఓటరు జాబితా

- అర్హులంతా ఓటరుగా నమోదు కావాలి
- రిటర్నింగ్ అధికారి శేషశైలజ


మల్లునాయుడుపాలెంలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్వో శేషశైలజ

సబ్బవరం: ఓటరు జాబితాను పారదర్శకంగా రూపొందించడానికి అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని పెందుర్తి అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శేష శైలజ అన్నారు. దీనిలో భాగంగా చేర్పులు, మార్పులతో పాటు డూప్లికేట్, చనిపోయిన వారి ఓట్లు తొలగించనున్నట్టు తెలిపారు. ప్రతి ఒక్కరూ ఓటరు జాబితా పరిశీలించి ఓటు హక్కు ఉందో లేదో పరిశీలించుకోవాలని సూచించారు. ఓటరు జాబితా పక్కాగా తయారు చేయడానికి అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని ఆమె కోరారు. మండలంలోని మల్లు నాయుడుపాలెంలోని జిల్లా పరిషత్ హై స్కూల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌లను శనివారం ఆమె పరిశీలించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గతనెల 27వ తేదీన రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు డ్రాఫ్ట్ ఓటర్ల జాబితా విడుదల చేశామన్నారు. అందులో తప్పులను సవరించుకునేందుకు, కొత్తగా ఓటర్ల నమోదుకు సంబంధించి ఫారం 6, ఫారం7 ఫారం 8 లను పోలింగ్ బూత్ లెవెల్ అధికారులు స్వీకరించాల్సి ఉంటుందన్నారు. శని, ఆదివారాల్లో స్పెషల్ క్యాంపెయిన్ నిర్వహిస్తున్నామన్నారు. అంతేకాకుండా ఓటర్లు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకునేందుకు పోలింగ్ కేంద్రాల్లో విద్యుత్ సౌకర్యం,వెంటిలేషన్, విశాలమైన గదుల సదుపాయం తదితర అంశాలను పరిశీలించామన్నారు. కొత్తగా ఓటు హక్కు పొందే యువత సద్వినియోగం చేసుకోవాలని ఆమె పిలుపునిచ్చారు. ఆమె వెంట తహసీల్దార్ బి.సత్యనారాయణ, ఎంపీడీవో బి. రమేష్ నాయుడు తదితరులు ఉన్నారు.

ప్రజోపయోగంగా ఉపాధి పనులు

ఏపీడీ మణికుమార్


మాట్లాడుతున్న ఏపీడీ మణికుమార్

సబ్బవరం: ఉపాధి హామీ పనుల్లో ప్రజోపయోగమైన పనులు గుర్తించాలని ఏపీడీ మణికుమార్ సూచించారు. అనకాపల్లి క్లస్టర్ పరిధిలోని అన్ని మండలాల ఉపాధి హామీ పథకం సిబ్బందికి స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో శనివారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీవో రమేష్ నాయుడు అధ్యక్షత నిర్వహించిన శిక్షణ శిబిరంలో ఏపీడీ మణికుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆయా మండలాల పరిధిలోని ఏపీవోలు, ఇంజినీరింగ్ అసిస్టెంట్స్ ,టెక్నికల్ అసిస్టెంట్లు,సబ్బవరం మండల ఫీల్డ్ అసిస్టెంట్స్ పాల్గొన్నారు. ఏపీడీ మాట్లాడుతూ 2024– 2025 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఏ రకమైన పనులు చేపట్టవచ్చో అనే అంశాలను వివరించారు. ప్రతి గ్రామంలో కొత్తగా ఉపాధి హామీ పథకంలో ఎన్ని పనులు గుర్తించాలో చర్చించారు. ముఖ్యంగా ప్లాంటేషన్ వర్క్స్,ట్రెంచ్ వర్క్స్, ఫీడర్ చానల్స్ వర్కులు చేపట్టాలన్నారు.ప్రతి గ్రామ పంచాయతీలో ప్రజా ప్రతినిధులకు తెలిసేటట్టు ప్లానింగ్ చేయాలని, శాస్త్రీయంగా అధ్యయనం చేయాలని ఆయన వివరించారు.

అయ్యప్ప సన్నిధిలో మండల దీక్షల జోరు


పెందుర్తిలో మండల దీక్ష తీసుకుంటున్న అయ్యప్ప భక్తులు


పూజలందుకున్న అయ్యప్పస్వామి

పెందుర్తి: ఉత్తరాంధ్ర శబరిమలగా పేరుగాంచిన పెందుర్తిలోని అయ్యప్పస్వామి ఆలయంలో అయ్యప్ప భక్తులు భారీ ఎత్తున మండల దీక్షలు తీసుకున్నారు. శనివారం వేకువజాము నుంచి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గురుస్వామి రాము ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకుడు పాండూరు మణికంఠశర్మ చేతుల మీదుగా భక్తులకు మాలధారణ చేశారు. దాదాపు 200 మంది భక్తులు అయ్యప్ప దీక్ష స్వీకరించారు. మాజీ ఎమ్మెల్యే పీలా గోవిందసత్యనారాయణ దీక్ష స్వీకరించి పూజల్లో పాల్గొన్నారు. మహా అన్నదానాన్ని రాము గురుస్వామి ప్రారంభించారు.

'లంచం' ఓ సామాజిక రుగ్మత


బహుమతులు అందిస్తున్న ప్రిన్సిపాల్ చంద్రశేఖర్, పవర్‌గ్రిడ్ ప్రతినిధులు

పెందుర్తి: లంచం తీసుకోవడం ఎంత నేరమో..ఇవ్వడం కూడా అంతే అపరాధం అని పెందుర్తి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ చంద్రశేఖర్ అన్నారు. లంచం అనేది ఓ సామాజిక రుగ్మత అన్నారు. విజిలెన్స్ అవగాహన వారోత్సవాల్లో భాగంగా పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో కళాశాలలో 'సే నో టూ కరప్షన్..కమిట్ టూ ద నేషన్' అనే అంశంపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. మొదటి నుంచి నాలుగో స్థానం వరకు నిలిచిన కె.శేఖర్, బి.అక్షయ, జె.వి సిరిచందన, ఎంవీ గీతాచార్యకు ప్రిన్సిపాల్ చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లంచాలను ప్రోత్సహించడం ఎలాంటి స్థితిలోనూ మంచి పరిణామం కాదన్నారు. కార్యక్రమంలో పీజీసీఐఎల్ చీఫ్ మేనేజర్ రాధామనోహర్, సీనియర్ మేనేజర్ వెంకటేశ్వరరావు, అధ్యాపకులు మూర్తి, వెంకటరమణ పాల్గొన్నారు.

సీసీ కెమెరాలతో రక్షణ


సీసీ కెమెరాలపై అవగాహన కల్పిస్తున్న సీఐ ఇమ్మానుయేల్ రాజు

సీతమ్మధార: ద్వారకా క్రైం పోలీస్ స్టేషన్ పరిధి సీతమ్మధార, నార్త్ ఎక్స్‌టెన్షన్‌లోని హిల్‌వ్యూ పార్కులో శనివారం పార్కు అసోసియేషన్ ప్రెసిడెంట్ భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో సీసీ కెమెరాలపై సీఐ టి.ఇమ్మానుయేల్ రాజు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఇంటి వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఒక కెమెరా వంద మంది పోలీసులతో సమానమన్నారు. నిఘా కెమెరాల ఏర్పాటు ద్వారా ఇళ్లు, కార్యాలయాలకు రక్షణతో పాటు గతంలో జరిగిన దొంగతనాలను సులువుగా చేధించవచ్చని పేర్కొన్నారు. అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే తక్షణమే సంబంధింత పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు. నగదు, బంగారు ఆభరణాలును బ్యాంక్‌లో భద్రపరుచుకోవాలని సూచించారు. ఊళ్లు, దూర ప్రాంతాలకు వెళ్లేటప్పుడు తాళాలు జాగ్రత్త పరచాలన్నారు. అపార్ట్‌మెంట్లలో రిజిస్టర్ బుక్ ఏర్పాటు చేసుకొని వచ్చి పోయే వారి వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో క్రైం ఎస్ఐ నిహార్, స్థానికులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.